కథా నిలయం
2938
శ్రీకాకుళం

# బాబు

## 1

నిద్రమైకంనుండి బయటపడి తలెత్తి పైకి చూసేడు. ఇక ముందేం చేస్తావని అడుగుతున్నట్టు ప్రత్యక్షమైంది కేలండరు. భయంకరంగా కనిపించిందా తేదీ!—ముందుకి చకచకా పోతున్న కాలం తనమీద కసితీర్చుకునే సమయం ఆసన్నమైందనుకున్నాడు ప్రకాశం. ఇంకా ఉద్యోగం చేసేటందుకు తనలో ఓపిక వుంది; అవసరంకూడా వుంది! కాని తనలోని ఓపికను, అవసరాన్ని గుర్తించవలసిన ఆవశ్యకత ప్రభుత్వానికి లేదని అతనికి తెలుసు! ఏమైనాసరే తననా రోజున ఉద్యోగంనుంచి ప్రభుత్వం రిటైర్ చెయ్యక తప్పదు!

ఇక ముందుగతి?...

తనుతప్ప మరేదిక్కూ లేని తన ఆరేళ్ళకొడుకు భవిష్యత్తు?—ఏం చెయ్యాలో తోచని పరిస్థితిలో పడ్డాడు. ఎంత ఆలోచించినా భవిష్యత్తుదారులు అగమ్యమయాయి అతనికి! మరో పదేళ్ళపాటైనా తనకా వుద్యోగం వుండుంటే అంతబాధ లేకపోయేది! అప్పటికి కొద్దోగొప్పో కొడుక్కి చదువుచెప్పించి వుండేవాడు. ఏ స్థిరాస్థీ లేకుండా కేవలం ఉద్యోగంమీదే ఆధారపడున్న తను, ఉద్యోగం లేకపోయిన

తరువాత కనీసం స్కూల్ ఫైనల్ వరకైనా కొడుక్కి చదువు చెప్పించగలడా?—ఒట్టిమాట!—పోనీ ప్రావిడెంటువండయినా చాలినంత వస్తుందాఅంటే అంతాకలిసి వెయ్యిరూపాయిలకి మించదు. ఆ వెయ్యిరూపాయలతోనూ యెన్నాళ్ళు కాలక్షేపం చెయ్యడం?

ఆ తల్లితోపాటు వాడూ ఆ పురిట్లోనే చచ్చుంటే ఏ బాధా లేకపోయేదనే కుళ్ళుఉద్దేశం కలిగిం దతనికి! తనకి మరింతబాధ కలిగించడానికి వాడు బ్రతికున్నాడేమో అనుకున్నాడు ప్రకాశం!

—కాని మళ్ళా బాగా ఆలోచించాడు. బ్రతికుండడమే వాడితప్పుగా భావించకపోతే, వయస్సుమళ్లేక రెండోవివాహం చేసుకొని పిల్లణ్ని కనడం తన తప్పే అని యెందుకనుకోకూడదనుకున్నాడు ప్రకాశం! కాని ఆ రోజుల్లో—అంటే—మొదటిభార్యపోయిన కొన్నాళ్ళతరువాత తనలో యేర్పడ్డ ఉద్రేకాలవల్ల ఇంట్లో వండిపెట్టేందుకుకూడా యెవరూ లేకపోవడంవల్లా పెళ్ళిచేసుకోడం అవసరం అనిపించింది. తన మొదటిభార్య కూతురైన రమణమ్మ యీ వయస్సులో పెళ్ళిచేసుకోవద్దని యెంతచెప్పినా వినకుండా ఒక శుభముహూర్తాన తాళికట్టేశాడు!—పిల్లణ్ని కని, తన కప్పజెప్పి పోయిందది!

కన్న మమకారాన్ని ఎలా చంపుకోడం? వాణ్ని బాగుచెయ్యాలి! వాడు బ్రతికిబాగుంటే చూచి ఆనందించాలి తను!—కాని వాడు బ్రతికి బాగుండడం యెలా? బడి పంతులు పనైతే యేం ఏదో ఉద్యోగంఅంటూ ఒకటుంది

కనుక వాడినంతవరకూ పెంచగలిగేడు తను!...ఇకిటుపైని ?
-గడ్డు సమస్యగా ప్రత్యేక్షమైంది భవిష్యత్తు! అంతులేని
ఆలోచనలో పడ్డాడు ప్రకాశం!

అంతలో వీధిగుమ్మంలోంచి కొడుకు పరుగెత్తు
కొచ్చి—"బండికందరూ పోతున్నారు నాన్నా! నాకు వేగం
చల్దన్నంపెట్టు" అన్నాడు.

"ఇవాళ్టికి నువ్వే పెట్టేసుకొని తినెయ్యకూడదూ?"
అని బాబు ముఖంలోకి చూసేడు ప్రకాశం!

"ఆ కూడు నాకందదు నాన్నా! కుండ నెలా క్రిందికి
దించడం?" అని తన చేతగానితనాన్ని వ్యక్తపరుస్తూఅన్నాడు
బాబు.

అవును తనకి కావలసినవి సంగ్రహించుకో లేనంతటి
చిన్నవయస్సులో తన కొడుకింకా వున్నాడు! తనన్నీ
అమర్చిపెట్టాలి! తనే లేకపోతే?—ఆవిషయం ఆలోచించ
డానికి భయపడ్డాడు!—

"సరే నేనే పెడతాలే, పళ్ళెం తెచ్చుకో!" అన్నాడు
మంచంమీాదినించి క్రిందికి దిగుతూ.

"పళ్ళెం యెక్కడుంది నాన్నా?"

"వంటింట్లో మంచినీళ్ళకుదురు వార ఉంటుంది
బాబూ!" అని సమాధానం యిచ్చేడు.

బాబు వంటింట్లోకి పరుగెత్తాడు. కుదురు వారఉన్న
పళ్ళేన్ని పట్టుకొచ్చాడు. "ఇదిగో పళ్లెం" అని చూపిం
చాడు.

"పెరట్లోకిపోయి కడిగి తెచ్చుకో" అన్నాడు ప్రకా
శం అటుక దగ్గరున్న నిచ్చెన నెక్కుతూ.

"ఎందుకెక్కుతున్నావు నాన్నా! నన్నూ ఎక్కిం
చవూ?" అనడిగేడు బాబు.

"ఇంత మీదికెక్కితే కళ్ళుతిరుగుతాయి. పెద్దవాడి
వైతే యెక్కొచ్చులే" అన్నాడు.

బాబు అందుగురించి పట్టుబట్టలేదు. పెరట్లోకి వెళ్ళి
పోయేడు పళ్ళెం కడుక్కునేటందుకు.

ప్రకాశం కాస్త ఆవకాయతీసి కిందకి దిగిపోయేడు.
అప్పటికింకా బాబుపళ్ళెం కడుక్కురాలేదు. ఇంకాయెంచేత
రాలేదోనని పెరట్లోకి వెళ్ళేడు ప్రకాశం. బాబునూతిదగ్గర
నిలబడి లోనికి చూస్తున్నాడు.

"ఏమిటి బాబూ! అలా చూస్తున్నావు?" అనడి
గేడు ప్రకాశం.

"గోలెంలో నీళ్ళులేవునాన్నా! నూతిలో వున్నాయి.
నే తోడలేను."

అట్టడుగున వున్నవాటిని బయటికి తీసుకునే శక్తి
బాబుకి వచ్చేవరకూ తను పెంచాలి! ఎలా?—నీళ్ళుతోడి
తనే పళ్లెం కడిగేడు.

అన్నం వడ్డిస్తున్నప్పుడు అందులో చచ్చిన సాలి
పురుగు ప్రత్యక్షమైంది. "నయం! గ్రుడ్డిగా వడ్డించేసేను
కాను! లేకపోతే..." అని తండ్రి గొణుక్కుంటూవుంటే
కొడుకు అందుకొని "ఏం నాన్నా?" అనడిగేడు ఆశ్చ
ర్యంగా!

"చూసేవా సాలిపురుగు!—మహావిషం! ఈ అన్నం తినొద్దు. ఇవాళ్టికి హోటల్లో టిఫిన్ తిందాం!" అంటూ ఆ అన్నాన్ని పెరట్లో పెంటకుప్పమీద పారబోసేడు!

ఆకలితో ఉన్న బాబు ఆవేళ అన్నం తినకుండానే లేచిపోయాడు. కాని ఆ ఆకలిబాధ హోటలుకి వెళతాంకదా అన్న సరదాలో కొంత లుప్తమైంది!

తండ్రి పొందుతున్న మనోవ్యాకులత బాబుకేం తెలుసు? —ఆ దినప్రారంభంలోనే ఒక అపశకునం! —తను వడ్డించబట్టిగాని, బాబే ఆ అన్నం వడ్డించుకొని తినేసివుంటే ఏమైవుండేవాడు? వచ్చే ప్రమాదాన్ని గుర్తించలేనంతటి చిన్నవయస్సు! తనకుద్యోగం లేకపోతేనేం? తన బాబుకోసమైన శ్రమతీసుకోక తప్పదనుకున్నాడు.

చినిగిన లాల్చీతొడుక్కున్నాడు ప్రకాశం. ఆతొడగడంలో మరింత బాగా చిరిగిపోయిందా లాల్చీ! బాబు ఆ సంగతి గమనించాడు. "నాన్నా! సడ్డిమీద బాగా చినిగిపోయింది, చొక్కా కుట్టించుకోకూడదూ?" అని అన్నాడు.

"అలాగే" అని సమాధానమిచ్చాడు ఇంకొన్నాళ్లుపోయాక లాల్చీలు చిరగడం, వాటిని కుట్టించడం ఆబాధే వుండదు! లాల్చీఅంటూ ఒకటున్నప్పుడు కదాఅది చిరగడం, దానికతుకులేయించి కుట్టించడం యీ బాధంతాను! అప్పుడు జీవితంలో బాహ్యంగా కనిపించని ఓచిరుగుమాత్రం వుంటుందనుకున్నాడు.

బాబు పుస్తకాలు సర్దుకోడం పూర్తయింది. గుమ్మం దగ్గర కొచ్చాడు. మళ్ళీవెనక్కితిరిగి తాళాలగుత్తికోసం

వెతుకుతున్న తండ్రిదగ్గరికొచ్చి, "నాన్నా! ఈయేడాది పేసయితే మళ్ళీయేడాది సీక్లాసుకొస్తాను కదూ!" అని అడిగాడు.

ఏం సమాధానం చెప్పడానికీ తోచలేదు ప్రకాశానికి! "సరేగాని, తాళాలగుత్తి కనిపించడంలేదు. మంచంకింద పడిపోయిందేమోచూడు" అన్నాడు. బాబు మంచం క్రిందకిదూరేడు. కొంతదూరం అయాక "ఇదిగో నాన్నా! తాళాలగుత్తి" అంటూ సంతోషంతో బయటికొచ్చాడు.

ఏదో పెద్దఘనకార్యం సాధించినవాడిలా తాళాలగుత్తి పట్టుకొని ఘనంగా నిలబడ్డ బాబుముఖంలోకి వాత్సల్యంతో చూసేడు ప్రకాశం! అలా యెంతోసేపుచూడలేకపోయాడు. "పదస్కూలుకి పోదాం!" అన్నాడు తాళాలగుత్తి అందుకుంటూ. తలుపేస్తున్నప్పుడు ఎదురుగా వున్న కేలండరులో స్ఫుటంగా కనిపించింది ఆతేదీ! గట్టిగా కళ్ళు మూసుకున్నాడు! కళ్ళుమూసుకునే తాళంవేసేడు.

గొడుగవసరం అంతగా అప్పట్లో లేదుగాని, చినుకులుమాత్రం కొంచెం పడుతున్నాయి. క్రిందబురద, మీాది నుండి చిటచిటమని చినుకులు! నడవడానికి బాధగా వున్నా భరిస్తూ ముందుకు అడుగులువేస్తూ పోతున్నారు. ఆ వుభయులూ!

కొంతదూరం వెళ్లేక, "నాన్నా! ఇవాళ బడికి మనం ఆలస్యంగా వెళుతున్నాం కదూ?" అనడిగేడు బాబు.

"అవును. నిన్ను కనడంకూడా ఆలస్యంగానే జరిగింది" అందామనుకున్నాడు. కాని బాబుతో అలా అనడం

అవివేకం అనిపించి "పద గబగబ" అని మాత్రం అన్నాడు. చిన్నచిన్న అంగలేసుకుంటూ బాబు తండ్రితో సమానంగా పోతున్నాడు.

ఆ వూళ్లో కొత్తగా పెట్టిన హైస్కూలు ప్రక్కనుంచి పోతున్నారు. సరిగ్గా హైస్కూలు గేటు దగ్గరికొచ్చేసరికి బాబు—"ఈ పెద్దబడిలో నన్నెప్పుడు చదివిస్తావు నాన్నా" అని అడిగేడు.

"నువ్వు చక్కా అయిదో క్లాసు పేసయితే; అప్పుడు!"

"అప్పుడు మరి నువ్వు ఈ బడిలోనే పని చెయ్యడాని కొస్తావా?" అనడిగేడు తండ్రిముఖంలోకి చూస్తూ.

బాబు అమాయకంగా అడిగిన ఆ ప్రశ్న అతనిలో కల్లోలాన్ని రేపింది. తన జీవితంలో ఉద్యోగపర్వం ఆ దినంతో సమాప్తమవుతున్నట్టు బాబుకి తెలీదు!—లోకం అంటే ఏమిటో తెలియని బాబు ఎన్నెన్నో ఊహల్ని సృష్టించుకుంటున్నాడు. వయస్సు హెచ్చవుతున్న కొద్దీ ఊహించిన ఒక్కొక్క ఊహా, ఊహించలేనంతటి క్రిందకి పడిపోతున్నప్పుడు, బాబు హృదయం ఎంతలా బాధపడు తుందో? ఊహించడానికే భయం వేసింది ప్రకాశానికి!

స్కూలు దగ్గరపడింది.

"నాన్నా! — కాఫీహోటల్‌కి వెళదామన్నావ్?" అన్నాడు బాబు.

"అయ్యో!—నామతిమండా!—మరిచిపోయానుస్మీ!" అని వెనక్కితిరిగి అక్కడికి దగ్గరలో ఉన్న ఓ హోటలులోకి తీసుకెళ్ళాడు బాబుని జేబులు తడుముకున్నాడు. ఫరవా

లేదు!...నిబ్బరంగా టిఫిన్ చేసేరు. బిల్లుచెల్లించి బయట పడ్డారా వుభయులూ.

పాఠశాల ఆవరణలోనికి ప్రవేశించారు.

మెల్లమెల్లగానే అయినా కళ్ళు తడబడ్డాయి ప్రకాశానికి! వణుకుతూన్న కంఠంతో "బాబూ! ఇక నీ క్లాసుకి వెళ్లు" అన్నాడు.

సంతకం చెయ్యడానికని హెడ్మాష్టరుగారి గదిలోకి వెళ్ళాడు ప్రకాశం.

"ఏం మాష్టారూ! ఇవాళింత ఆలస్యాంగా వచ్చేరేం? ఇవాల్టితో యీ బడితో సంబంధం తీరిపోతుందనా?" అనడిగేరు హెడ్మాష్టరు!

"అబ్బే!—లేవడం కాస్త ఆలస్యం అయింది."

"సరే!—సంతకంచేసి క్లాసులోకెళ్ళండి. ఆఖరి పీరియడయేక 'రిటైర్' చేసేసి, రిలీవ్ చేసేస్తాను. మధ్యాహ్నం స్కూలులేదుగా మరి!" అన్నాడు.

చాలా కఠోరంగా వినిపించాయా మాటలు ప్రకాశానికి. కానీ ఏం చేస్తాడు?...ఆ విషయంలో ఆ హెడ్మాష్టరు చేస్తున్న నేరమేముంది కనుక? అతని విధి అతను నిర్వర్తిస్తున్నాడు!...

సంతకం చెయ్యడానికి పెన్నుతీసేడు. హస్తం కంపించింది. ఏగాలి కీసేడు.

క్లాసులోకి వెళ్ళాడన్నమాటేగాని, ప్రకాశం మనస్సంతా పుట్టెడు బెంగతో వూగులాడుతోంది!

ఒకటోగంట వినిపించింది!

అతనిగుండె ఝల్లుమంది!—మరి గంటలుకొట్టకుండా వున్నా బాగుండుననిపించింది. కాని ఆ వేళ కాలం కాలం చాలా వేగంగా పయనిస్తున్నట్లు ఫీలయేడు ప్రకాశం!

రెండూ, మూడూ గంటలుకూడా పూర్తయేయి!

ఆఖరిగంట సమీపించింది! ... ఆ వేద నెక్కువయింది ప్రకాశంలో. ఆగంటకూడా మ్రోగింది!...

తడబడుతున్న అడుగులతో హెడ్మాష్టరుగదిలోకి ప్రవేశించాడు.

అప్పటికే ప్రకాశాన్ని రిటైరు చెయ్యడానికి అవసర మైన తంతంతా పూర్తిచేసేసేడు "హెడ్ మాష్టరు."

హెడ్ మాష్టర్ తోపాటు మిగతా సహోపాధ్యాయులుకూడా తమతమ సానుభూతులను తెలియజేసేరు.

"వస్తా!—ఇంకా యింటికిపోయి వంటచేసుకోవాలి. ఏదో యిన్నాళ్లూ తామంతా నన్నెంతో అభిమానంతో చూసేరు. అందుకు మీ అందరికీ నా కృతజ్ఞతాపూర్వక అభివందనాలు!" అని అందరికీ వందనంచేసి ఆ ఆఫీసు గది లోంచి బయటపడ్డాడు. గేటుదగ్గర తనకోసం కాచుకూర్చున్న బాబుని కలిసేడు.

"చాలాసేపటి క్రిందట గంటకొట్టారుకదా నాన్నా మరి యింత ఆలస్యంగా వచ్చేవేఁవిటి నాన్నా?" అనడిగేడు బాబు.

"ఏంలేదు బాబూ! హెడ్ మాష్టరుగారితో మాట్లాడుతున్నా!" అన్నాడు.

ఆకలిబాధ యెక్కువగా వుండడంచేత దారిలో మరేం మాట్లాడలేదు బాబు!

మాట్లాడే పరిస్థితిలో లేదు ప్రకాశం!

ఇద్దరూ యింటికి చేరుకున్నారు.

## 2

భోజనాలయేక బాబు కొంతసే పటూయిటూ తిరిగి, ఎక్కాలబుక్కు తీసి చదవడం మొదలెట్టేడు.

ప్రకాశం నడుం వాల్చేడు బల్లమంచంమీద. కొంత సేపయినా ప్రపంచాన్ని మరచి నిద్రపోదామని అతని ప్రయత్నం!...

అంతట్లో......

అకస్మాత్తుగా వచ్చిపడిందో వైరు. మొదటిభార్య కూతురైన రవణమ్మదగ్గరినుంచి!—భర్త చాలా సుస్తీగా వున్నట్టూ, వెంటనే బయలుదేరి రమ్మనీ ఆ వైరు సారాంశం!

తను రెండోవివాహం చేసుకున్నాక రవణమ్మ ఒక్కసారైనా రాలేదు సరికదా తరచు ఉత్తరాలైనా వ్రాయ లేదు!...పోనీ వ్రాయకపోతే వ్రాయకపోయిందిగానీ, అది సుఖంగావుంటే అంతే చాలనుకున్నాడు తను!...అతని పరిస్థితి ఆందోళనకరంగా లేకపోతే తనకు వైరెందుకు చేస్తుంది?

భర్తతరఫున దానికెవరూ లేరు!...

ఈ సందర్భంలో తను వెళ్ళక తప్పదనుకున్నాడు.

"బాబూ! యిలా రా!" అని పిలిచేడు.

బాబు వచ్చాడు!

"చూడు నాయనా! — నీ బట్టలెక్కడున్నాయో వెతికి తీసుకురా; అక్కయ్యగారూరు వెళదాం" అన్నాడు ప్రకాశం.

"అక్కయ్యా ... అక్కయ్యా ... అని అంటూ వుంటావుకదా నాన్నా! అక్కయ్య ఎలా వుంటుంది? కిట్టిగాడూ వాళ్ళఅక్కయ్య లాగుంటుందేఁవిటి?" అని అడిగేడు బాబు.

"కిట్టిగాడూ వాళ్ళక్కయ్యకన్నా చాలా పెద్దది. నీ అంత కొడుకుకూడా వున్నాడక్కయ్యకి! చక్కా నువ్వూ వాడూ ఆడుకోవచ్చు!"

"అయితే వెళదాం నాన్నా! రైలుమీందా? బస్సు మీందా?"

"రైలుమీందే వెళ్ళాలి. చాలాదూరం వాళ్ళూరు."

"నే రైలెప్పుడూ యెక్కలేదు!—చక్కా యివేళ ఎక్కుతాను—అయితే నాన్నా! ... అక్కయ్య మనూరు ఎప్పుడూ రాలేదేం?"

ఏఁవని సమాధానం చెప్పడం?—బాబే లేకపోయుంటే వచ్చుండేదేమో!—"మరి వాళ్ళూరు చాలాదూరంకదూ? - అంచేతే రాలేదు!" అని సమాధానమిచ్చాడు.

"మరయితే బాబిగాడూ వాళ్ళక్కయ్య ప్రతీ పండుక్కీ వస్తూంటుందేం? వాళ్ళూరుకూడా చాలా దూరమేనట!"

బాబుగాడడిగే ప్రశ్నలు ప్రకాశానికి విసుగునీ, దుఃఖాన్నీ కలుగజేస్తూండడంచేత వాటికి మరి సమాధాన

మివ్వకుండా—"సరేగాని, ముందు నీ బట్టలన్నీ వెతికి తీసుకురా, పెట్టెలో సర్దుతాను." అన్నాడు.

"అయితే మనం అక్కయ్యగారూళ్ళో ఎన్నాళ్ళుంటాం నాన్నా?"

"బావగారికి జబ్బుగావుందిట!—ఆ జబ్బు తగ్గిపోయే వరకూ వుండి వచ్చేస్తాం!"

"బావగారెలా వుంటారు నాన్నా?"

"బాగుంటారు!—వెళ్తున్నాంగా; చూద్దువుగాని!—మొదట నీ బట్టలన్నీ వెతికి తీసుకురా" అన్నాడు పెట్టె తెరుస్తూ.

బాబు మంచందగ్గిరి కెళ్ళేడు. దానిమీదున్న తన రెండు చొక్కాలూ పట్టుకొచ్చాడు. "మిగిలినవి దండెం మీదున్నాయి. నా కందవవి!" అన్నాడు.

"సరే!—నీ పుస్తకాలన్నీ సర్ది పట్రా; అక్కడున్నన్నాళ్లూ చదువుకోవడానికి!" అన్నాడు.

కొంతసేపయింది!

సర్దడం పూర్తయింది.

పర్సు తెరచి చూసేడు. నలభైఒక్కరూపాయీ నాల్గణాల అర్ధణావుంది!—ఆ నెలజీతం, ప్రావిడెంటుఫండూ వచ్చే వరకూ అతనివద్దనున్న ఆస్తి అదే! — అంతవరకూ యెలా కాలక్షేపం చెయ్యడమో అర్థంకా లేదతనికి.

## 3

వీధిమలుపు తిరిగేసరికి అల్లుడియిల్లు ఓ ఫర్లాంగు దూరంలో కనిపించింది ప్రకాశానికి. గుమ్మంముందు చాలా

మంది మూగివుండడంచేత ప్రకాశంమనస్సులో ఆందోళన చెలరేగింది.

"ఇంకా చాలాదూరం వుందికదూ అక్కయ్యగారిల్లు" అనడిగేడు బాబు. అలా అడగడంలో బాబు వుద్దేశ్యం యేమిటంటే—అలా యింకా చాలాదూరంగా అక్కయ్యగారిల్లున్నట్లయితే, తను చాలాసేపు సరదాగా రిక్షాలో కూర్చోవచ్చుకదా అని!—

కానీ బాబు సరదా మాయమయిపోయేటట్టు—"ఇదిగో వచ్చేసేం!... ఆ యిల్లే!—ఆ మనుషులు మూగున్నారే...అదేను!" అని సమాధానమిచ్చాడు ప్రకాశం.

ఆ యింటిముందు రిక్షా ఆగింది!

తండ్రీ కొడుకులిద్దరూ దిగేరు.

రిక్షాలోంచి సామాను దించడం, లోన మంచంమీంది నుంచి శవాన్ని దించడం, రెండూ ఒకేసారి జరిగేయి!—

ఘొల్లున యేడుపులు వినిపించేయి!

ప్రకాశం లోనికి పరుగెత్తాడు.

గుండెలు బాదుకుంటూ భర్తశవంమీంద పడి, బావురుమని ఏడుస్తున్న కూతురిముఖంలోకి కన్నీరుకారుస్తూ చూసేడు!

"నాన్నా!...అంతా అయిపోయాక వచ్చావా?... అయ్యో!...ఒక్కమారు కళ్ళిప్పిచూడండి...మీ మావగారొచ్చారండీ!—" భర్త హృదయంమీద ముఖంపెట్టి, హృదయవిదారకంగా విలపిస్తూన్న కూతుర్ని పట్టుకొని, చిన్నపిల్లడిలా ఏడవడం మొదలెట్టాడు ప్రకాశం.

"ఇంక నాకెవరు దిక్కు నాన్నా?—ఈ చంటివాడిని చూడు నాన్నా!—ఇంక వీడు 'నాన్నా' అని యెవర్ని పిలుస్తాడు?—అయ్యో నాయనా! ఎంతపనయింది నాయనా!..." ఆమె యేడుపుకి మరి ఆనకట్టలేదు. అదే ధోరణి!—

"ఇంత చిన్నవయస్సులోనే...ఇంతకీ యిదంతా మన దృష్టం—ఆ భగవంతుడు..." పూర్తిచెయ్యలేకపోయాడా వాక్యాన్ని. కన్నీళ్ళద్దుకున్నాడు. "ఆఖరిసారిగా అల్లుడితో మాట్లాడలేకపోయాను. ఇలా అవుతుందని అనుకోలేదమ్మా!—ఈ ప్రపంచంలో"—ఇంకా వాక్యం పూర్తి కాకుండానే వెనుకనే నిలబడివున్న బాబు—"నాన్నా! నాకిక్కడ భయంగావుంది. మనం వేగిరంపోదాం రా నాన్నా!" అన్నాడు.

రవణమ్మ బాబు వేపు తలెత్తి చూసింది. దుఃఖంలో దుఃఖం కలిసిపోయింది!!!

తండ్రిని ఏదో అడుగుదామని నోరు తెరిచేడు బాబు. కాని అంతమందిమధ్య ఆ వాతావరణంలో అడగడానికి భయపడ్డాడు. ఈ అనంతమైన జగత్తులో చావుపుట్టుకల ఆంతర్యం, మనిషికీ మనిషికీగల సంబంధాల సన్నిహితత్వం ఎలాంటి పరిణామాలకి దారితీస్తుందో తెలియని బాబుకి ఆ పరిస్థితి అంతా భయానకంగా కనిపించింది!...ఇంకా అక్కడే వుంటే ఏంప్రమాదం వస్తుందోనని భయం వేసింది!—కాని తండ్రి తన భయాన్ని గుర్తించేస్థితిలోలేడని బాబు తెలుసుకున్నాడు. తండ్రి కళ్ళంట నీరుకారుస్తూ ఏడ్వడంచూచి తనూ బావురుమన్నాడు. అలా యెందుకేడవాలో బాబు

కంతగా తెలియలేదుగాని, అసలు ఆదృశ్యం అంతా యేడుపుల మయమైంది గనక తనూ ఏడ్చేసేడు!—

పచ్చబద్దల పల్లకీ తయారైంది! కర్మకాండ పూర్తయింది. రవణమ్మ తెలివి తప్పిపోయింది. అదే సమయానికి శవాన్ని భుజాలకెత్తుకున్నారు మోతగాళ్ళు!

రవణమ్మకి తెలివి వచ్చేసరికి భర్తశవం అక్కడ లేదు. బాబుమాత్రం కళ్లెదుట కనిపించాడు. ఆప్రక్కనే నిలబడి వున్నాడు తన కొడుకు నానిగాడు. "నాన్న నెక్కడికి తీసుకెళుతున్నారని" యేడుస్తూ నాని అడిగేడు బాబుని. కొడుకు ప్రశ్నవిని మళ్ళీ తెలివి తప్పిపోయింది రవణమ్మ.

## 4

పన్నెండురోజులూ గడిచేయి!—"ఇంక నే వెళిపోతానమ్మా!" అన్నాడు ప్రకాశం కూతురితో.

"ఎక్కడికి నాన్నా?" అనడిగింది రవణమ్మ.

ఆ సంశయం ప్రకాశానికీ కలిగింది! ఎక్కడికి వెళితే మాత్రం తన కేముంది గనక!—ఉద్యోగమా ఏమన్నానా!-—ప్రకాశం యింకా సమాధానం యివ్వకముందే—"నీకక్కడ ఉద్యోగం అయిపోయిందిగా!" అంది.

"ఔను!—అక్కడపని పూర్తయింది. కానీ—"

"మరయితే అక్కడి కెందుకు?"

"ఏఁవీలేదు; ఏఁవైనా ప్రైవేట్లు చెప్పుకొని బ్రతకొచ్చుగదా అని!"

"ఆ బాధంతా యెందుకు?-ఇంక నాకెవరున్నారు గనక!-ఇక్కడే వుండిపో నాన్నా! ఈపసివాడితో ఏమొగదిక్క

లేకుండా ఒక్క ఆడదాన్నీ యెలాబతకడం చెప్పు?" అని నానిగాడి తలనిమురుతూ కన్నీరుకార్చింది రవణమ్మ.

అదీ నిజమే అనుకున్నాడు ప్రకాశం. అల్లుడు బ్రతికున్నట్టయితే తన అవసరం కూతురికేమీ లేకపోయివుండేది. అశక్తత పరసహాయాన్ని ఆశిస్తుంది!—ఆకారణంచేతే కూతురు తనని ఉండిపొమ్మంటున్నాదనుకున్నాడు! బతకడానికి మరే యితరఆస్కారం లేనితండ్రినిచూస్తూ పొమ్మనేందుకు పితృప్రేమ అడ్డుతగలడంవల్లనే అక్కడ తనతో కూడా ఉండమనిఅనేలా చేసిందని ఎందుకనుకోకూడదని కూడా భావించాడు!

ఏ వుద్దేశ్యంతో ఉండిపొమ్మన్నప్పటికీ, తనక్కడ శాశ్వతంగా తిష్ఠవెయ్యడంవల్ల యేవైనా వికృత సమస్యలు ఉత్పన్న మవుతాయేమోనని భయపడ్డాడు. తనొక్కడూ ఉండిపోతే అలాంటి సమస్యలేవీ ఉత్పన్నంకావు!—కాని తనతోకూడా బాబు ఉన్నప్పుడే గొడవ!—ఎలా?—బాబునెక్కడ ఉంచడం? తనతోబాటే బాబుండాలి!—అయితే ఎక్కడుండడం?—ఎవ్వరికీ బాధకలగనిచోట!—ఆచోటెక్కడ?—మరి తోచలేదు ప్రకాశానికి!...

"ఇంతగా ఆలోచించాలా నాన్నా!—అక్కడ నువ్వు లేకపోతే మనయిళ్లూ వాకిళ్లూ, భూములూపోతాయని భయమా? ఇంతకీ నిన్నుండిపొమ్మంటున్నది నీకూతురేగానీ, మరెవరో పరాయిది కాదు!—ఆయన శాశ్వతంగా విడిచిపోయారు. నువ్వు బ్రతికుండికూడా నాకు దూరమవుతావా నాన్నా" అని బావురుమంది రవణమ్మ.

"అలాగేలే అమ్మా!—ఉంటాను!" అన్నాడు ప్రకాశం బరువుగా ఓనిట్టూర్పు విడుస్తూ.

"తాతయ్యా! నువ్వు చక్కా యిక్కడే వుండిపోతావుగా!—మరివెళ్ళకేం?! మరి నాన్న రాలేదు చూడు!" అన్నాడు మనమడు నానిగాడు అమాయకంగా.

"నాయనా!" అంటూ నానిగాడిని ఎత్తుకుంటూ కన్నీరుకార్చేడు ప్రకాశం. రవణమ్మ కొంగుతో కన్నీళ్ళద్దుకుంది.

"అయితే నాన్నా! మనం మనూరుపోమా?" అని ఆందోళనగా అడిగేడు బాబు. ఎంచేతో అక్కడ ఉండడం బాధ అనిపించింది బాబుకి. వచ్చినదగ్గరనుంచీ ఆ యింట్లో ఏడుపులూ మొర్రలే!!—ఇక అక్కయ్య తనను చేరదీసి ఆదరించడం లేనేలేదు. పైగా తండ్రికూడా అదోలా వున్నాడు. ఆవాతావరణం బాబుకి అసహ్యాన్ని కలిగించింది. ఇంకా అక్కడుండడం బాధఅనిపించి యెంతత్వరలో అక్కడినుంచిపోతే అంత బాగుంటుందనిపించింది బాబుకి!-

—వచ్చిన దగ్గరనుంచీ బాబలా 'పోదాం పోదాం' అంటూవుండడం రవణమ్మ వింటూంది! ఆమెకు ఓప్రక్క కోపం మరోప్రక్క దుఃఖంకూడా కలిగేయి!— ఆపోయే వాడు ఆ తల్లితో పాటే పోయుంటే బాగుండిపోయేదనుకుంది!—

"ఎక్కడికిరా పోతావు?!—వచ్చిన దగ్గర్నుంచి ఒకటేగోల పోదాం పోదాం అని!" అని గట్టిగా కసిరింది రవణమ్మ.

రవణమ్మ అలా అనడంతోనే, బాబు భయంతో ముఖం అదోలా పెట్టేడు! పైకి యేడవలేదుగాని లోలోపల యేడ్చేడు!—

“వీడినలా చూస్తావో మరి!—తల్లీ తండ్రీ నేనేఅయి ఇంతవరకూ పెంచేను. ఆఖరికి వీడివల్ల నాకు దుఃఖమేమిగులుతుందో, సంతోషమే మిగులుతుందో!—ఆబాధ్యత నీపైన వుంది” అన్నాడు ప్రకాశం బాబుని ముందుకితీసుకొని తల నిమురుతూ.

రవణమ్మ ఆ విషయం ఏమీ అనకుండా మాటలు మారుస్తూ—“నాన్నా!-ఈనానిగాడు ఒక్కపిసరైనా చదవకుండావున్నాడు. వీడికి చదువుమీద శ్రద్ధకలిగించే పూచీ నీది.” అంది.

“చిన్నపిల్లడుకదమ్మా మరి! — ఒకనెలరోజుల్లో మీతమ్ముడితో సమానంగా చదివేస్తాడు!—ఏరా నానీ!” అన్నాడు.

“వాడికన్నా నాకే బాగావచ్చు తాతయ్యా!” అన్నాడు నానిగాడు ఒక్కగంతేసి తాతని సమీపిస్తూ.

“ఆఁ!— నేను రెండోక్లాసు పుస్తకం చదివేస్తా!— ఏంనాన్నా!” అన్నాడు బాబు తన ఘనతను వ్యక్తంచేస్తూ.

బాబలా అనగానే రవణమ్మకి కొంత ఉడుకుమోత్తనం కలిగింది. తన కొడుకూ, సవితితమ్ముడూ ఒకే యీడు వాళ్ళని ఆమెకు తెలుసు!- అయినా బాబుగాడు తన కొడుకు కంటే తెలివితేటలు కలిగివున్నాడు. వాడు స్వయంగా తన తోడుబుట్టిన తమ్ముడే అయివుంటే ఆమెలో ఆ రకమైన

యీర్ష్యకి తావుండేదికాదు. కాని సవితి తమ్ముడయి పోవడంచేత సంబంధం దూరమైపోయింది!- మరి వాడు బాగుంటే చూసి ఆనందించడం ఎలా?—

"చూస్తూవుండలా! ఒక్క నెలరోజుల్లో నీకన్నా బాగా చదవగల్గుతాడు వాడు" అంది రవణమ్మ.

"ఈలోగా నేనూ మరికొన్ని కొత్తవి నేర్చేస్తాను" అని గొణిగేడు బాబు.

"ఒరేయ్ బాబూ!- మీవూళ్లో నువ్వెప్పుడైనా సర్కస్ చూసేవురా మరి? ఇన్నికబుర్లు చెప్తున్నావుకదా!" అనడిగేడు నానిగాడు.

"చూడు నానీ!- వాడు నీకేమవుతాడో తెలుసా?- మామయ్య-ఇహనుంచీ మామయ్యా అని పిలవాలి వాణ్ని" అన్నాడు ప్రకాశం నానిగాడితో.

"మరయితే వాడు. నన్ను 'నానీ' అని పిలవొచ్చే మిటి?" అని గొణిగేడు నానిగాడు.

"ఇంతకీ ఎలాగో ఓలా పిలుచుకోనిద్దూ నాన్నా!- ఎలాపిలుస్తేనేం?"అని వంటింట్లోకి వెళ్ళిపోయింది రవణమ్మ.

బాబుగాడిని 'మామయ్యా' అని పిలవమని తను చెప్పినప్పుడు కూతురి ముఖం అదోలా మారిపోవడం గమనించి ఆమె మనస్సులో యేదో బాధపడుతున్నదని ఊహించేడు ప్రకాశం. బాబుమీద ఆమెకి రవంతైనా అభిమానం లేదేమోననే అనుమానంకలిగిం దతనికి. నిజమే మరి!- 'సవితితల్లి కొడుకుమీద అంత అభిమానం యెలా వుంటుంది' అనుకున్నాడు.

"వొద్దు వొద్ద"ని కూతురెంత చెప్పినా వినకుండా రెండో పెళ్ళి చేసుకున్నాడు తను!_ అందుకే అనుభవించాలి మరి!_ ఇంకా నయం! అదికూడా బ్రతికున్నట్లైతే తను భార్యతోసహా బాబుని పెట్టుకొని యెలా జీవిస్తాడు? అది చచ్చిపోడంకూడా ఒకందుకు మంచిదేనేమో అనుకున్నాడు!_ పైగా ఇక్కడ అల్లుడు చనిపోవడంకూడా ఒకరకంగా తన మంచికోరకేనేమో అనుకున్నాడు. అల్లుడు బ్రతికుంటే కూతురు తనని ఉండిపొమ్మని బలవంతం చేస్తుందా?_ అప్పుడు తనేం చేస్తాడు?_ బాబు నెలాపోషిస్తాడు? అల్లుడు పోబట్టి ఆమెకి మరో మగదిక్కు లేకపోబట్టి తనని ఉండిపొమ్మంది!_ తిండికి దేవులాడ నక్కర్లేదిక అనుకున్నాడు. ఎంత యిదైనా రవణమ్మకి తాను తండ్రి; ఆమెదృష్టిలో తానెంత నేరస్థుడైనా తిండిపెట్టకుండా తగిలీదు!_ తనముఖం చూసి బాబునికూడా పోషిస్తుంది. తను చచ్చిపోయాక_ ఏమో?!!___

తన చావుసంగతి జ్ఞప్తికొచ్చేసరికి ముచ్చెమటలు పోసేయి ప్రకాశానికి. బాబు భవిష్యత్తు సమస్యరూపంలో భయంకరంగా యెదురైందతనికి. ఆలోచించడానికి భయం వేసింది!_ చివరికి అంతా "భగవత్ కృప" అనే సిద్ధాంతానికొచ్చేడతను.

## 5

"చూడు నాన్నా!_ నానిగాడికి అక్కయ్య అణా యిచ్చింది. వాడు పకోడీలు కొనుక్కొని తిన్నాడు. నాకిమ్మంటే

యిచ్చేడు కాడు. నువ్వియ్యి నాన్నా! నాకో అణా!" అనడిగేడు బాబు ఉడుకుమోత్తనం మిళితమైన ఏడుపుతో.

"అక్కయ్యను నువ్వుకూడా అడగలేకపోయావా మరి?" అన్నాడు ప్రకాశం.

"నాకు భయం నాన్నా!- నే నడిగితే కసురుతుంది"

బాబు తండ్రితో అంటూన్న యీ మాటల్ని ప్రక్క గదిలోంచి వింది రమణమ్మ. ఒళ్ళుమండిం దామెకి. తనెప్పుడు వాణ్ని కసిరిందికనుక!- వెంటనే ధుర్రున అక్కడి కొచ్చింది. "నిన్నెప్పుడు కసిరేనురా నేను? - వెధవబద్ధాలూ నువ్వూను!" అంది బాబుని కోపంగా చూస్తూ.

"ఏదోనమ్మా చిన్నపిల్లడు-" అన్నాడు ప్రకాశం క్షమించమని ప్రాధేయపడుతున్నట్టు.

"ఆఁ!- చిన్నపిల్లడు!- ఇలా అబద్ధాలు చెప్పడంలో మాత్రం పెద్దవాడే! అసలు నేనెప్పుడూ కసరలేదు వాణ్ని!- ఎలా చెప్తున్నాడో చూడు!- నాకెందుకని వాడి జోలికే పోడంలేదని నేను."

"చూడు రమణా!- తల్లి నెరగే యెరగడు. వాడిని వాత్సల్యంతో చూడమ్మా!"

"నువ్వు మరీ యిదిగా మాట్లాడుతున్నావు నాన్నా!- ఇప్పుడు వాణ్ని నేనేమన్నాను గనక?" అని రమణమ్మ అంటూవుండగానే నానిగాడు వీధిలోంచి రివ్వున పరుగెత్తుకొచ్చి తాతయ్య వొళ్లోదూకేడు. "ఛా రా నానీ, మరి మామయ్యకి పకోడీలు యిచ్చేవు కావేం?- నువ్వొక్కడివీ తినేయడం తప్పుకాదూ?" అనడిగేడు ప్రకాశం నానిగాడిని.

"వాడి కెందుకివ్వాలి మరి?- వాడికిమ్మని అమ్మ చెప్పిందేఁవిటి?" అని గొణిగేడు వాడు.

"నే చెప్పకపోతేమాత్రం?- వాడికూడా యివ్వ లేకపోయావురా?" అనంది రవణమ్మ.

"మరయితే వాడికోసం మరోఅణా నే నడిగినప్పుడు, 'అక్కర్లేదు. వాడికి కనిపించకుండా తినేసెయ్.' అన్లేదూ నువ్వు?" అని అడిగేడు తల్లిని అమాయకంగా నానిగాడు. అలా అడగడంవల్ల వచ్చే ఫలితాలు నానిగాడికేం తెలుసు?-

నానిగాడి చంపమీద కోపంతో ఛెళ్ళున లెంపకాయ కొట్టింది రవణమ్మ - "అబద్ధాలుకూడా నేర్చేవ్?- నేనలా నీతో అన్నాన్రా?" అని మరోటి కొట్టింది.

"అయ్యో?-పసివాడి నలా ఎందుకు కొడతావమ్మా." అని అడ్డుకున్నాడు ప్రకాశం.

"అది కాదు నాన్నా! 'నే నొక్కణ్ణే తినేస్తానని' వాడను కుంటూ వెళ్ళిపోతూవుంటే - పనితొందర్లో 'నీయిష్టం' అని అనేసేను కాబోలు;" అంది రవణమ్మ తన తప్పులేదని సమ ర్థించుకుంటూ.

— తాము చేసిన తప్పుని యెదుటివాళ్ళమీద త్రోసేసి తమాషాగా తప్పించుకునేటంతటి శక్తి నానిగాడి కింకా రాలేదు. అమ్మ కొట్టినందుకు యేడుపు లంకించు కున్నాడు. బాబు బిక్క చచ్చిపోయాడా దృశ్యాన్ని చూసి!- తననికూడా యెప్పుడైనా అక్కయ్య అలా కొట్టేస్తుందేమోనని భయంవేసింది బాబుకి. తనవల్లే

నానిగాడు దెబ్బలుతిన్నాడేమోననిపించి బాధపడ్డాడు బాబు!-

— ప్రకాశంకూడా బాధపడ్డాడు. అలాంటి చిన్న విషయంలో మనస్పర్థలు బయటపడ్డందుకు - తనే గప్‌చుప్‌గా ఓ అణా బాబుగాడిచేతిలో పెట్టేస్తే ఏతంటా లేక పోయేదిగా!- బాబుగాడి భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే బెంగ పట్టుకుంది ప్రకాశానికి.

## 6

ఆ వేళ ఓ ఉత్తరం అందుకున్నాడు ప్రకాశం అతను రిటైరు అయిన స్కూలు హెడ్మాష్టరుదగ్గర్నుంచి. 'ఆ క్రిందటి నెల జీతం వచ్చినట్టూ, తీసుకోనేటందుకు వస్తారా, లేక మని యార్డరు చేసేయమంటారా' అని.

తను ఎలాగూ వెళ్ళాలనుకున్నాడు ప్రకాశం. సామాను చాలవరకూ అక్కడే వుండిపోయింది. పైగా ఆ అద్దెయిల్లు ఖాళీ చేసేయాలి. ఎలాగైనా తను వెళ్ళవలసిన అవసరం వుంది. కాని అతని కొక్కటే సమస్య ఎదురైంది. బాబునికూడా తీసుకువెళ్ళడమా లేక తనొక్కడూ వెళ్ళడమా అని. చిన్నప్పటినుంచీ తనను విడిచిపెట్టి ఒక్కనాడూ ఉండలేదు బాబు! మరిప్పుడు విడిచివెళ్తే బెంగపెట్టుకోడూ?- రవణమ్మ వాడిని సరిగ్గా చూస్తుందనే నమ్మకం యేఁవిటి?-

కూతురికి చెప్పేడు- "నే నూరికి వెళ్ళాలి. అక్కడి యిల్లు మొదట ఖాళీచేసి సామాను తీసుకురావడం, క్రిందటి నెల పని చేసినంతవరకూ నాకు రావలసిన జీతం పుచ్చు

కోడం, ప్రావిడెంటు ఫండు త్వరగా వచ్చేటందుకు తగిన యేర్పాట్లు చెయ్యాలి. ఇప్పటికే ఆలస్యమైపోయింది"

"సరే?- వెళ్ళిరా నాన్నా - నీకెంత డబ్బుకావాలో చెప్పు, ఇస్తా" అంది కూతురు.

"డబ్బుమాటకేంగానీ, బాబుగాడొక్కడూ ఇక్క-డుండగలడా అని నా అనుమానం. వాడినీ నాతోపాటు తీసికెళ్దాం అనుకుంటున్నాను." అన్నాడు.

"బాగుంది. అయితే యిక్కడ నేనేమైనట్టు?- వాడొక్కడూ ఉండవలసిన ఖర్మేం?- అయినా బాబుగాడి విషయంలో మొదటినుంచీ నువ్వు నన్ను అనుమానిస్తూనే ఉన్నావు!- ఇంతకీ బాబుగాడు నాకే ద్రోహమూ చెయ్య లేదు. వాడివల్ల తప్పు రవంతైనా లేదు. వయస్సుమళ్ళిన తరువాత పిల్లల్ని ఎలాపోషిస్తావనయినా ఆలోచించక మళ్ళీ పెళ్ళిచేసుకోడం నీది తప్పు ఓరకంగా?- అంతేగాని వాడి తప్పు కాదు. అప్పట్లో నీమీద కోపం వచ్చిన మాట మాత్రం వాస్తవం?- కాని అదిప్పుడు తగ్గిపోయింది. నీకేం భయం లేదు నాన్నా?-వాడిని నేను జాగ్రత్తగా చూస్తాను. నువ్వేళ్ళు. ఇవాళంటే నువ్వు బతికున్నావు ఇకముందు నేనేగా వాడికి దిక్కు?- అంచేత మరేం ఫరవా లేదు. నువ్వు లేకుండా నాలుగురోజులపాటు వాడొక్కడూ నాదగ్గరవుంటే క్రమేపీ చను వేర్పడుతుంది. ఇప్పుడెంచేతో వాడు నన్నుచూసి భయ పడుతున్నాడు." అంది రమణమ్మ.

ప్రకాశం మరేం మాట్లాడలేకపోయాడు. బాగా

ఆలోచించేడు. తనొక్కడూ వెళ్ళడానికే నిశ్చయించు కున్నాడు.

ఆ సాయంత్రం కొడుకునీ, మనవడినీ బజారుకు తీసి కెళ్ళి మిఠాయి కొనిచ్చేడిద్దరికీ. బాబు మిఠాయి తింటూ ఉన్నప్పుడు చెప్పేడు. "చూడు నాయనా! నేనూరి కెళ్ళి రేపే వచ్చేస్తాను. మరేం భయపడకు, అక్కయ్య నీకావలసినవన్నీ యిస్తుందిలే?" అని.

"ఉహూఁ!—నేనూ వస్తాను. నా కిక్కడ భయం!" అని గునిసేడు.

"మరి చూడూ నాతో వచ్చేస్తే రేపు బడిలో పాఠాలుపోవూ?—మేష్టారు కోంబడతారు. చక్కా నానిగా డున్నాడు నీకుతోడు. నీకు భయమేఁవిటి చెప్పు?—అదీగాక సినీమా కెళ్ళడానికి డబ్బులిస్తాను. చక్కా యిద్దరూ చూద్దురుగాని మనింటిదగ్గరే హాలుకూడాను." అని ఓ రెండు రూపాయిలుతీసి చెరొకటీ యిచ్చేడు ప్రకాశం.

సినీమాకెళతాం కదా అన్న సంతోషంతో ఒప్పేసు కున్నాడు బాబు తండ్రిప్రయాణానికి.

"నువ్వు తప్పకుండా రేపొచ్చేస్తావుకదూ?" అనడిగేడు.

"ఓ. తప్పకుండా!" అన్నాడు ప్రకాశం. తను తిరిగి రావడానికి వారంరోజులు పడుతుందని చెప్తే ఒప్పుకోడనే భయంతో అబద్ధం ఆడేసేడు. ఆ రాత్రిట్రైన్ కే ప్రయాణ మయేడు ప్రకాశం.

# 7

ఆ మర్నాడు బాబుకి పూర్తిగా మతిపోయినట్ల యింది. తన నేదో మహా ప్రమాదకరమైన ప్రదేశంలో ఉంచేసి తండ్రి వెళిపోయినట్టు ఫీలయేడు. బెంగతో అతికష్టం మీద ఆరోజు గడిపేసేడు.

ఆ మర్నాడు బడిలో నానిగాడిని అడిగేడు. "మా నాన్న యింకా రాలేదేం?—నిన్నటికే వచ్చేస్తా నన్నాడు కదా!" అని.

"ఏమో నాకేం తెలుసు?—అయినా ఎందుకురా ఆ బెంగ?— మా నాన్న యిప్పటివరకూ రాకపోయినా నేను భయపడుతున్నా నేంటి!" అని నానిగాడి సమాధానం.

"మీ నాన్నెప్పుడూ రాడుమరి! — చచ్చిపోయిన వాళ్ళు మరిరారని మానాన్న చెప్పేడు!" అన్నాడు బాబు!

"నిజమేనేంవిట్రా? — అయితే మా నాన్న మరి రాడూ?"

"ఊహూఁ!—"

"పోనీలే!—మా అమ్మ ఉంటూవుండగా నాకు భయ మేంటి?" అన్నాడు నానిగాడు.

"నా కసలు అమ్మ లేనేలేదు!"

"అసలు ఎప్పుడూ లేదన్నమాట!"

"లేదు. నాకొక్క నాన్నే ఉన్నారు. ఆ నాన్నిప్పు డింకా రాలేదు చూడు!"

"మా నాన్నలా చచ్చిపోయా రేంటో!—లేకపోతే నిన్నరాత్రికే వచ్చేసుండేవారు!" అన్నాడు నాని.

బాబు గుండెల్లో రాయిపడింది. "నిజమే అంటావా?—" అని కళ్ళంట నీళ్ళు కార్చేడు బాబు. బెంగ పట్టుకుంది బాబుకి.

"తాతయ్య చచ్చిపోయినా, కర్రలమీదకట్టి ఇక్కడికే యెవళ్ళయినా తీసుకొస్తారులే! — భయంలేదేడవకు. అయినా మా అమ్మఉంటూవుండగా నీకు భయమేఁవిటిరా!" అని నానిగాడు అంటూ వుండగానే బెల్లుమ్రోగింది!— అంతా క్లాసులోకి వెళ్ళారు.

బాబు మరేం మాట్లాడలేదు. ఆ లేతహృదయం బెంగతో నిండిపోయింది. ఈ ప్రపంచంలో నాన్నొక్కడే మంచివాడని బాబు నమ్మకం. అలాంటి నాన్న లేకపోతే తనగతేం కానని బాబు భయం.

క్లాసులో మాష్టారు లెక్కలు చెప్తున్నారు. బాబు పరధ్యాన్నంగా వింటున్నాడు.

"రెండూ, మూడూ కలిపితే ఎంతరా?" — చటుక్కున బాబు నడిగేరు మాష్టారు.

"ఆరు!" అన్నాడు బాబు! - ఛెల్లుమంది చెంప!

బావురుమన్నాడు బాబు! ఆ ప్రక్కనేఉన్న నానిగాడి నడిగేరు మాష్టారు. "అయిదు" అని చెప్పాడు నానిగాడు. బాబుని తెగకొట్టి నానిగాడ్ని మెచ్చుకున్నాడు మేష్టరు.

బాబు తెగవడిచాడు. ఆ ప్రశ్న సరిగ్గా వింటే సరయిన సమాధానం చెప్పేసేవాడే!

ఇంటి కొచ్చేక నానిగాడు బళ్ళోజరిగిన సంగతి వాళ్ళమ్మతో చెప్పేడు.

"ఓరి బడ్డూ! - రెండూ, మూడూ కలిపితే ఎంతవుతుందో తెలీదూ?" అని గట్టిగా అడిగింది రవణమ్మ బాబుని.

బాబు బిక్కచచ్చిపోయాడు. మరేం మాట్లాడలేదు. ఇక అక్కయ్యకూడా తంతుందేమోనని భయపడ్డాడు. నాన్నె ఉంటే?-అలా యెవరైనా తననంటే ఊరుకుంటాడూ అనుకున్నాడు.

"పోనీ ఏడూ ఎనిమిదీ కలిపితే ఎంత?" అనడిగింది రవణమ్మ.

"పదిహేను." అని బాబు సమాధానం.

"ఇది చెప్పగలిగినవాడివి ఆ మాత్రం చిన్నప్రశ్నకు జవాబు చెప్పలేకపోయాంవేరా?"

"నే సరిగ్గా వినలేదు." అని గొణిగేడు.

"సరిగ్గా ప్రశ్న వినకపోడం నీతప్పే? - ఆ ఊరి బడనుకున్నావేఁవిటి?-కోదండం ప్రేలకట్టి డొక్క చీల్చేస్తారిక్కడి మేష్టర్లు! - సరేగాని, తిండికి పద!" అని వంటింట్లోకి వెళ్ళిపోయింది రవణమ్మ.

ఆ వాతావరణం అంతా మహా భయంకరంగా కనిపించింది బాబుకి. అక్కయ్య అందులో ఓ పెనుభూతంలా కనిపించింది!

ఆ వేళ బాబు అన్నందగ్గర కూర్చున్నాడన్నమాటే గాని ఒక్క మెతుకూ నోట్లో వేసుకోలేదు.

"ఏంరా అలాతింటున్నావేం?"అనడిగిందిఅక్కయ్య.

"నాన్న..." అని గొణిగేడు. కళ్ళంట అప్రయత్నంగా నీళ్ళుకారేయి బాబుకి.

"మొదట అన్నం తింగు! - నాన్నొస్తాడులే. నీ ప్రాణం నేనేం తీసెయ్యడంలేదు" అంది రవణమ్మ కాస కటువుగా.

బాబు తినబోయేడు. కానీ ఆ నోట్లో వేసుకున్న రెండు మెతుకులూ వాంతిద్వారా బయటికొచ్చేసేయి!

"ఛీ! - అపసంతి వెధవా!" అని చీదరించుకుంది రవణమ్మ.

చెయ్యికడుక్కున్నాడు బాబు. ఒంటిమీద అంతగా తెలివిలేదు. గదిలో ఓ మూలకెళ్ళి కూలబడ్డాడు.

మధ్యాహ్నం బడి వేళయింది. "ఏరా మొద్దు వెధవా!- ఏమిటా నిద్ర బడి వేళయింది. లే!" అని బాబు భుజంతట్టి లేపింది రవణమ్మ. శరీరం వేడిగా తగిలింది. మళ్ళీ ముట్టుకుంది. కాలిపోతున్నది శరీరం! - "ఏరా! - ఒళ్ళు వేడిగా వుందేం" అనడిగింది.

"తలనొప్పి!" అని మూలిగేడు బాబు. మరోమారు శరీరాన్ని తాకింది. మరిగిపోతున్నది శరీరం. ఆయాసంతో మూల్గుతున్నాడు బాబు!—

"చూడు బాబూ!-తలనొప్పి యెక్కువగా ఉందా?" అని ఆప్యాయంగా అడిగింది.

అంతమంచిగా అక్కయ్య అడుగుతుందనుకోలేదు బాబు. "ఊ!" అని మాత్రం అన్నాడు - "మరేం భయం లేదు నాయనా! అదే తగ్గిపోతుంది." అని, పందిరిమంచం మీద పక్కదులిపి, బాబునెత్తుకొని దానిమీద పడుకో

బెట్టింది. అక్కయ్య అంత సదుపాయం చేస్తుందనుకోలేదు బాబు.

"నాన్నింకా రాలేదూ?" అని మూలిగేడు బాబు.

"ఒస్తారు నాయనా! - నువ్వు పడుకో. ఈలోగా నీకా-వలసినన్ని పళ్ళు తెప్పిస్తాను" అంది.

బాబు ప్రక్కకొత్తిగిల్లేడు –

-- అమాయకంగా జ్వరంతో పడుకున్న బాబు వేపు చూసింది. అదేమంచంమీద తనభర్తకూడా జబ్బుతో ఉన్నన్నాళ్ళూ పడుక్కున్న సంగతి ఆమెకి జ్ఞాపకానికొచ్చింది. ఆ మంచంమీంచే దించేసేరు. ఆ విషయం జ్ఞాపకం రాగానే ఆమెకి భయంకరమైన అనుమానం కలిగింది! - కొంపదీసి బాబు చచ్చిపోడుకదా అని!-అప్పట్లో బాబు చచ్చిపోతే అనవసరంగా తనెంతటి అపనిందకు గురవుతుందో ఊహించలేకపోయింది. తనే యేదో మందిచ్చి చంపేసివుంటుందని తండ్రి అనుమానించదూ? - లోకులు కూడా అలాగే తీర్మానించరూ? - తనకూ బాబుకూ ఉన్న సంబంధం ఆ రకమైన అనుమానానికి అవకాశమివ్వడంలో అసహజంవుందా? - అనవసరమైన నిందకు తను గురికావలసిందేనా? -

--- అసలలాంటినిందే ఒకవేళవస్తే అది అసహజమైన నిందవుతుందా అనే అనుమానం కలిగిందామెకు. ఆరోగ్యంగావున్న బాబుకి ఆ వేళ ఆ జ్వరం రావడానికి కారణం?- బాబుపట్ల తన ప్రవర్తనేనేమో! - అసలు బాబాయింట్లో కాలుపెట్టిన నాటిదగ్గర్నుంచీ, వాడిమీదోరకమైన యీర్ష్యాభావం

తోనే చూస్తున్నది గాని, చేరదీసి లాలించనూ లేదు, వాత్సల్యమూ చూపలేదు - పైగా తనభర్త పోయాడన్న దుఃఖంలో యేడుస్తూ శోకదేవతలా వాడిముందు ప్రత్యక్షమైందేగాని, చిరునవ్వుతో వాడిని చేరదీసే మాతృమూర్తిలా కనిపించనే లేదు. మాతృత్వపు ప్రేమపాశాల మధ్యనుండే వాత్సల్య మాధుర్యాన్ని రుచిచూడని బాబుకి తన ప్రవర్తనవల్ల స్త్రీ అంటే ఓ భయంకరమైన విషమనే అభిప్రాయం యేర్పడ్డంలో అసహజం యేమీ లేదేమో అనుకుంది. చిన్నప్పటినుండీ నాన్న దగ్గరే పెరిగేడు, నాన్న నెప్పుడూ విడిచివుండలేదు - అసలే నాన్నింకా రాలేదనే బెంగతో వున్న బాబుని మేష్టరు కొట్టేడు. పైగా యింటికొచ్చాక తను తిట్టింది. - ఇక చిన్న వయస్సులో ఉన్న బాబు బెంగపెట్టుకొని జ్వరం తెచ్చుకోడంలో ఆశ్చర్యం ఉందా? - ఆ పరిస్థితిలో తను వాత్సల్యంతో చూసి వున్నట్లయితే ఆ జ్వరానికి బాబు గురయి వుండేవాడు కాడు అనుకుంది.

--- తనకు వాడు సవతితల్లి కొడుకయిన మాట నిజమే - సవతితల్లి తననేరకంగానూ బాధించలేదు. అసలామెను తను చూడనేలేదు. పిల్లడ్ని కని చచ్చిపోయింది - కల్లాకపటంలేని ఆ అమాయకపు పసిపిల్లడిమీద తనకెందుకూ యీర్ష్య? అర్థంలేనిది ఆ యీర్ష్య - తనతోపాటే తన తండ్రి రక్తాన్ని పంచుకున్నాడు. ఏమైనా వాడు తనకు తమ్ముడే - వాడి ప్రాణాలెలాగయినా కాపాడాలనుకుంది.

ఆ సాయంకాలం డాక్టరుకి కబురుచేసింది. డాక్టరు వచ్చేడు. "గుండెకాయ కొన్నాళ్ళయి చెడినట్టుంది. దాని

మీద ఏదో విపరీతమైన భీతి కలగడంవల్ల యీ జబ్బొచ్చింది" అన్నాడు డాక్టరు బాబుశరీరాన్ని పరీక్షచేసి.

"ఎలాగైనా మీరు రక్షించాలి బాబూ! - ఎంత ఖర్చయినా వెనుదియ్యను!" అన్నది రమణమ్మ ఆందోళనగా.

"ప్రయత్నిస్తాను." అని డాక్టరు ఓ ఇంజక్షన్‌యిచ్చి- "నిద్ర బాగా పట్టేస్తుంది. గడియ గడియకీ పిలవకండి - నిద్ర లేచేక ఓ కప్పు కాఫీ యివ్వండి. ఆ తరవాత ఎవర్నైనా మందుకి పంపించండి" అని చెప్పి ఫీజు పుచ్చుకొని వెళిపోయాడు.

రమణమ్మలో ఆందోళన ప్రారంభమైంది - కొంపదీసి బాబు చచ్చిపోతే! తండ్రి తనింట్లో వుంటాడా యిక? - లోకులు తనమీద నింద మోపకుండా వుంటారా? - కనీసం తండ్రి వచ్చేటంతవరకైనా బ్రతికుంటే బాధలేదు. ఈలోగా బాబుకి సేవచేసి అక్కయ్య మంచిదేననే అభిప్రాయం కలగజెయ్యొచ్చు. వాడు తండ్రితో తనగురించి మంచిగా చెప్పి చచ్చిపోయినాబాధలేదు అనుకుంది-ఇంతకీబాబు ఆ మాత్రం జ్వరానికే చచ్చిపోతాడని ఎందుకనుకోవాలి? - ఏమైనా సరే వాడు చనిపోడానికివీల్లేదు. తనకు తమ్ముడొకడుండాలి- అందుకోసం వాడు బ్రతికి ఆరోగ్యంగా వుండాలని ఎందుకనుకోకూడదనుకుంది.

ఎందుకైనా మంచిది తండ్రికి వైరిస్తేనో - ఇంతకీ తన పిచ్చిగాని, ఏదో మామ్మూలుగా జ్వరం వచ్చింది. అంత మాత్రాన తనకా కంగారెందుకు? - ఎంతమందికి జ్వరాలు

వచ్చిపోడంలేదు? - కాని డాక్టరు "ప్రయత్నిస్తా"నని అన్నాడేగాని "ఫరవాలేదనలేదే" - అలా అంటేనేగాని ఎక్కువ డబ్బివ్వడనే ఉద్దేశ్యంతో అన్నాడేమోనని సమాధానపడింది.

ఆవేళ తండ్రిదగ్గరినుంచి ఓ లేఖ వచ్చింది రవణమ్మకు. ఇంకా అక్కడిపన్లు పూర్తికాలేదనీ, తను రావడానికి ఓ మూడురోజుల పైని పట్టొచ్చనీ; బాబుని వాత్సల్యంతో చూడమనీను!

ఉత్తరం చదవడం పూర్తయేసరికి - "అక్కయ్యా?- నాన్నింకా...రాలేదూ? చచ్చి...పోలేదు...క...దా?" అనడిగేడు బాబు మెల్లగా.

అప్రయత్నంగా కన్నీరు కార్చింది రవణమ్మ. "ఒస్తారు బాబూ?- మధ్యాహ్నం రైలులో వస్తారు. నువ్వు చాలా మంచివాడివి. ఈమందు తాగేయి బాబూ? నీకు మంచి బిస్కత్తులిస్తా?" అని మందు నోట్లోపోసింది. గుటుక్కున మ్రింగేసేడు బాబు.

మందు త్రాగేక బాబుకి మగత కమ్మినట్లయింది?- ప్రక్క కొత్తిగిల్లేడు.

బాబు బ్రతకాలని దేవుళ్ళందరికీ నమస్కారాలు పెట్టింది రవణమ్మ.తీరా తనకి వాడిమీద వాత్సల్యం జనించేసరికి వాడు దక్కకుండా పోతాడేమోనని ఆమెబెంగ.

## 8

తండ్రికి వైరు చేసిందావేళ రవణమ్మ.

ప్రకాశం గదిలో కాలుపెడుతూండగానే- "నా...

న్నా...అ...క్క...య్య..." అని గొణిగేడు బాబు.

"వచ్చేను నా...య...నా?" అన్నాడు ప్రకాశం బాబు నుదురుమీద ఆందోళనతో చెయ్యి వేసి.

బాబు మరి తండ్రిని చూడలేకపోయాడు. ఆగిపోయిందా పసి హృదయం?–

"అనుకున్నంతపనీ ... అయిం ... దని" బావురుమన్నాడు ప్రకాశం. "తండ్రియేడుపుతో శృతికలిపింది రవణమ్మ?– ఆమె యేడుపు చాలా అసహ్యంగా,వికృతంగా వినిపించింది ప్రకాశానికి!–

శవాన్ని తీసుకెళిపోయారు.

"తప్పంతా నాది. ఈబాధకోసమే రెండోపెళ్ళి చేసుకున్నాను. ఒకళ్ళమీద నిందవేసి యేం ప్రయోజనం?" అని తనలో తాననుకున్నాడు ప్రకాశం.

*　　　*　　　*

ఆ మర్నాటి ఉదయం తండ్రికోసం యిల్లంతా వెదికింది రవణమ్మ!గట్టిగా పిలిచింది."నాన్నా?"అని ప్రత్యుత్తరం పొందలేకపోయింది.

ఆరోజంతా నిరీక్షించింది తండ్రికోసం?– మరి రాడని నిశ్చయించుకుంది చివరికి?

కేవలం తుదివరకూ బాబుమీద ఈర్ష్యా అసూయలతోనే వుండి, వాడు చస్తేనే చాలనే దృక్పథంలో రవణమ్మ ఉండి వున్నట్టయితే లోకులు వేసిన నిందకు అంతగా బాధ పడుండేది కాదు!!!